# భార్య



'మాంధాత'

"కార్యేషు దాసీ
కరణేషు మంత్రి
శయనేషు రంభా
క్షమయాధరిత్రీ."

ఆంజనేయులు 'శాస్త్రాలు' చదువుకోలేదు. అతనికి తెలిసిన శాస్త్రం ఒక్కటే. 'గుర్రాల శాస్త్రం' లక్ష్మికి ఏ శాస్త్రమూ తెలీదు.

"ఇదుగో విన్నే—ఇవాళ తొరగా వంటతగలెయ్యి — పనిమీద పోవాలి— వచ్చేటప్పటికి ఆలస్యం కావచ్చు-మేలుకుండు-లేకపోతే తలుపు పగలగొట్టలేక చావాలి-ఏం, వింటున్నావా?" అన్నాడు ఆంజనేయులు వస్తూనే.

"విన్నాను....ఎక్కడికిపోవాలి?" అని అడిగింది లక్ష్మి.

"నేనెక్కడికి పోతే నీకెందుకే? నీ పని నువ్వేడవకా-అక్కర్లేని విషయాల్లో వేలుపెట్టి ఎన్నిసార్లు మొక్కలిరగ దన్నించుకుంటావు" అని అరిచి, పడక్కుర్చీ చర్రున లాగి కూరున్నాడు.

లక్ష్మి లోపలకి పోబోయింది.

"మాట్లాడుతుంటే లోపలికి పోతావేమే-వొళ్ల తీటగావుందా? - ఇదుగో పొద్దున పోయేటప్పుడు చెప్పా బట్టలుతకమని-వుతికావా లేదా?"

"ఆ."

లోపలకి వెళ్ళింది లక్ష్మి.

"ఏమేవ్, ఈ గాడిదకొడుకు వుచ్చ బోసినట్టున్నాడు-" అని రంకెవేశాడు ఆంజనేయులు, కాళ్ళదగ్గర నేలమీద పడుకుని నిద్రపోతున్న చంటికుర్రాణ్ణి అసహ్యంగా చూస్తూ. ఆంజనేయులు రంకెకి ఆ 'గాడిదకొడుకు' లేచి గొల్లున ఏడవటం మొదలు పెట్టాడు.

"ఒరేయి, పాడువెధవా — నోరు మూస్తావా — గొంతు పిసికి పారెయ్యమన్నావా — ఏమేవ్ ఎక్కడ చచ్చావే-ఒరేయి, వెధవ ముండాకొడకా, నోరు ముయ్యరా—ఏమే నువ్వొస్తావా, నేనొచ్చి నాలుగంటించాలా?...."

లక్ష్మి వొచ్చి, పిల్లవాణ్ణి తుడిచి, లోపలకి తీసుకెళ్ళాక ఆంజనేయులు చల్ల

బడ్డాడు.

"ఇదుగో, నీవంటతగలేసేసరికి తెల్లారే ట్టుంది — కొంచెం కాఫీ పెట్టు-పొద్దున విడిచిన లుంగీ కూడా నీళ్ళల్లో వెయ్యి-ఏం వింటున్నావా?"

లక్ష్మి కాఫీ యిచ్చివెళ్ళింది. కాఫీ తాగి గ్లాసు అక్కడపెట్టి టైం చూశాడు ఆంజనేయులు.

"ఏమేవ్, నీ వరాలు తగలెయ్య— ఇవాళ అవుతుందా లేదా? నాకు పనుందని చెప్పిన రోజునే నీకుమరీ రోగమొస్తుంది"

లోపల్నుంచి జవాబు రాకపోయేసరికి మరింత మండిపడి లేచి లోపలికెళ్ళాడు. స్టవ్‌మీద అన్నం వుడుకుపడుతోంది. లక్ష్మి దొడ్లో కంచాలు కడుగుతోంది. కుర్రాడు పొయ్యి దగ్గర బూడిదలో ఆడుకుంటు న్నాడు.

"ఏమేవ్, ఈ గాడిదకొడుకు బూడిద తింటున్నాడే—ఎక్కడ చచ్చావు నువ్వు? ఇంకా ఎంతసేపు?—ఆనందరావుకి ఎని మిదికల్లా వొస్తానని చెప్పా—నీ కసలు బుద్ధుందా?"

"అయిపోయిందండీ .... ఇవాళ పని మనిషి రాలేదు... గిన్నెలవీ కడిగే స రి కి ఆలశ్యమయింది...." అంటూ లక్ష్మి కడి గిన కంచాలు లోపలికి తీసుకువచ్చింది.

"పొద్దుటినుంచి ఏం చేశావు? అసలు నీరోగమిట్లాకాదు-ఫస్టునుంచీ పనిమనిషిని మానిపించేస్తా—"

ఆంజనేయులు కేకలకి కుర్రవాడు బావురుమన్నాడు.

"నోరు ముయ్యరా వెధవా—ఫో, పోయి వాణ్ని పడుకోబెట్టిరా—త్వరగా వడ్డించు."

అన్నం తింటున్నాడు.

ఎదురుగా నిలబడి వుంది లక్ష్మి.

"ఏమండి .... ఆనందరావుగారి దగ్గర ఏం పని?"

"అది నీ కనవసరం—నీ పని నువ్వు చూసుకో—ఇంట్లో పని కరెక్టుగా చెయ్యి-పిల్లాడికి కావలసిందేమిటో చూసుకో— ఇల్లు శుభ్రంగా వుంచు—నా బట్టలూ అవీ రెడీగా వుంచు.—ఇవీ నీ పనులు. ఏం అర్థమయిందా? నా విషయాల్లో వేలుపెట్టకు —ఏం? ఆడదానికి చెప్పే విషయాలుంటై చెప్పకూడనివి వుంటై—తెలిసిందా? నే నెంత చెప్పుతానో అంతే తెలుసుకోవాలి నువ్వు. అర్థమయిందా?" అన్నాడు ఆంజ నేయులు పీటమీదనుంచి లేస్తూ.

అర్థమయింది అనలేదు లక్ష్మి.

రాత్రి మూడింటికి వచ్చిన భర్తను నిరాకరించలేని లక్ష్మి, నిద్రలో భర్తకోరిక తీర్చేటపుడు, కలత నిద్రలోకి మారి, మగతగా, ఆ గుడ్డి వెలుతురులో, ఆ దగ్గర తనంలో, ప్రతి జంతువుకీ అనుభవమయిన ఆపేక్షతో,

"ఏమండీ, ఎందుకండీ ఆ పేకాటలూ, రేసులూనూ. నా మాట వినండి." అని ఏదో అనబోయింది.

"నోరు ముయ్యి. — ఇది ఆఖరి వార్నింగు. ఈసారి నా విషయాలు ఎత్తావా —మూతి పళ్ళు రాలగొడతాను—ఆడ ముండవి ఇంట్లో పడివుండి ఇంటిపనులు చూసుకో. ఏం అర్థమయిందా?"

అతని తిట్లు అతనికేమీ అడ్డురాలేదు...

శాస్త్రకారుడు చెప్పిన భార్యా లక్షణాల్లో 'రెండవది' తప్ప మిగిలినవి భర్తలందరూ ఇష్టపడతారు. □